తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
21 మే 2026
సంపుటి 03
సంచిక 221
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## ఏసీ చల్లదనం వెనుక కనిపించని ముప్పు...




- పెరుగుతున్న ఆరోగ్య సమస్యలపై ఆందోళన
- ఎండల తీవ్రతతో ఏసీల వినియోగం భారీగా పెరుగుదల
- తలనొప్పి, గొంతు పొడిబారడం, కళ్ల సమస్యలతో ఆసుపత్రుల బాట
- అతిగా ఏసీ వినియోగంపై నిపుణుల హెచ్చరిక

డెస్క్, మే 20 : వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇళ్లలో, కార్యాలయాల్లో, వాణిజ్య సముదాయాల్లో ఏసీల వినియోగం గణనీయంగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో చాలామంది రోజులో ఎక్కువసేపు ఏసీ గదుల్లోనే గడుపుతున్నారు. అయితే ఉపశమనం కలిగించే ఈ చల్లదనం వెనుక ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల వైద్యులు, ఆరోగ్య నిపుణులు దీర్ఘకాలం ఏసీ గదుల్లో ఉండటం వల్ల తలెత్తే సమస్యలపై హెచ్చరిస్తున్నారు. ఎండ నుంచి నేరుగా అత్యంత చల్లని గదుల్లోకి వెళ్లడం వల్ల శరీరం ఉష్ణోగ్రత మార్పులకు ఒక్కసారిగా స్పందించాల్సి వస్తోంది. ఈ ఆకస్మిక మార్పులు కొందరిలో తలనొప్పి, ముక్కు దిబ్బడ, గొంతు నొప్పి, శరీర నొప్పులు వంటి సమస్యలను పెంచుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా శ్వాస

➤ మిగతా 2వ పేజిలో..

## కులగణనకు సుప్రీం
## గ్రీన్ సిగ్నల్

- పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం
- ప్రభుత్వ విధాన నిర్ణయమని స్పష్టీకరణ
- సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 20 దేశంలో కులగణన ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను కొట్టివేస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అత్యున్నత న్యాయస్థానం అనుకూలంగా స్పందించింది. కులాల లెక్కింపు అంశం పూర్తిగా ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. కులగణన నిర్వహించాలా వద్దా అనేది విధానపరమైన అంశమని, అలాంటి నిర్ణయాల్లో న్యాయస్థానాల

➤ మిగతా 2వ పేజిలో..



## తెలంగాణలో జీసీసీల
## విస్తరణకు కొత్త దిశ

- హైదరాబాద్‌కు పరిమితం కాకుండా జిల్లాలకు ఐటీ విస్తరణ
- జీసీసీలు, డేటా సెంటర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశం

➤ 2వ పేజిలో..

## పోక్సో కేసుపై స్పందించిన
## బండి సంజయ్



- కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానన్న కేంద్ర మంత్రి
- విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని స్పష్టం
- రాజకీయ విమర్శలపై ఘాటుగా స్పందన

హైదరాబాద్, మే 20 పోక్సో కేసు వ్యవహారంపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు సంబంధిత కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చట్ట ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలనే ఉద్దేశంతో స్వయంగా పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. తాను ఎలాంటి వ్యక్తినో తమ పార్టీ కార్యకర్తలకు బాగా తెలుసని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కన్న కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన సంఘటనలు రాజకీయాల్లో చాలా అరుదుగా ఉంటాయని వ్యాఖ్యానించారు. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని, చట్టపరమైన ప్రక్రియకు సహకరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా

➤ మిగతా 2వ పేజిలో..

## సీఎం విజయ్
## టెస్ట్ డ్రైవ్ హల్‌చల్

- మెడికల్ సర్వీస్ జీప్ నడిపిన సీఎం
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు
- ప్రజారోగ్యంపై శ్రద్ధ అంటూ ప్రశంసలు



తమిళనాడు, మే 20 తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత దళపతి విజయ్ మరోసారి తనదైన శైలిలో వార్తల్లో నిలిచారు. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉన్న ఆయన తాజాగా ప్రభుత్వానికి సంబంధించిన కొత్త మెడికల్ సర్వీస్ జీప్‌ను స్వయంగా టెస్ట్ డ్రైవ్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అత్యాధునిక అత్యవసర వాహనాలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ వాహనం పనితీరును పరిశీలించేందుకు విజయ్ స్వయంగా డ్రైవింగ్ సీట్లో కూర్చొని జీప్‌ను నడిపారు. వాహనంలోని సౌకర్యాలు, పనితీరును దగ్గరుండి పరిశీలించినట్లు సమాచారం.

ఈ టెస్ట్ డ్రైవ్‌కు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సాధారణంగా ముఖ్యమంత్రులు ఇలాంటి వాహనాలను జెండా ఊపి ప్రారంభించడం కనిపిస్తుంటుంది. అయితే విజయ్ మాత్రం

➤ మిగతా 2వ పేజిలో..




## బంగ్లాదేశ్‌లో భారత అధికారి మృతి

- దౌత్య కార్యాలయంలో మృతదేహం గుర్తింపు
- పోస్టుమార్టం నివేదికపై ఉత్కంఠ
- అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభం

ఢాకా, మే 20 బంగ్లాదేశ్‌లో భారత దౌత్య కార్యాలయానికి చెందిన ఓ అధికారి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. బంగ్లాదేశ్‌లోని చట్టోగ్రామ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడిని నరేన్ ధర్గా గుర్తించారు. స్థానిక అధికారుల వివరాల ప్రకారం నరేన్ ధర్ చట్టోగ్రామ్‌లోని భారత దౌత్య కార్యాలయంలో సహాయ ప్రోటోకాల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆయన మృతదేహాన్ని పాత వీసా కేంద్ర భవనం పరిధిలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. భవనం రెండో

➤ మిగతా 2వ పేజిలో..



## డీఆర్డీవో క్షిపణి పరీక్ష విజయవంతం

- కర్నూలులో నిర్వహించిన కీలక ప్రయోగం
- డ్రోన్ ఆధారిత క్షిపణి సామర్థ్యాల ప్రదర్శన
- భారీ ఉత్పత్తికి సిద్ధమవుతున్న రక్షణ సంస్థలు

➤ 2వ పేజిలో..

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఉత్తర తెలంగాణ జిల్లాలకు హెచ్చరికలు
- ఆసుపత్రులు సిద్ధంగా ఉండాలన్న ఆదేశాలు
- తాగునీరు, చలివేంద్రాలపై ప్రత్యేక దృష్టి



హైదరాబాద్, మే 20 రాష్ట్రంలో తీవ్ర వడగాలులు, ఎండ తీవ్రత పెరిగే అవకాశాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల

➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
గురువారం , 21 మే , 2026
GENERAL NEWS


## ఏసీ చల్లదనం వెనుక కనిపించని ముప్పు

సంబంధిత సమస్యలు ఉన్నవారిలో ఇబ్బందులు మరింత అధికమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఇటీవలి పరిశీలనల్లో మరో అంశం వెలుగులోకి వచ్చింది. ఏసీ గదుల్లో ఎక్కువసేపు ఉండటం వల్ల గాలిలో తేమ తగ్గి శరీరంపై ప్రభావం చూపుతోంది. గాలి పొడిగా మారడం వల్ల గొంతు, ముక్కు భాగాలు, చర్మం పొడిబారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తగినంత నీరు తీసుకోకపోతే శరీరంలో నీటి కొరత మరింత పెరగవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడు కళ్ల సమస్యలు కూడా పెరుగుతున్నాయని వైద్య వర్గాలు చెబుతున్నాయి. చాలామంది దీన్ని మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగంతో మాత్రమే అనుసంధానిస్తుంటారు. కానీ తక్కువ తేమ ఉన్న ఏసీ వాతావరణం కూడా కళ్ల పొడిబారడం, మంట, చికాకు వంటి సమస్యలకు కారణమవుతోందని పరిశీలనలు సూచిస్తున్నాయి.

కార్యాలయాల్లో ఎక్కువసేపు పనిచేసే ఉద్యోగుల్లో అలసట, చర్మ పొడిబారడం, అసౌకర్యం వంటి సమస్యలు కూడా కనిపిస్తున్నాయని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, ఫిల్టర్లను శుభ్రం చేయకపోవడం, మూసివేసిన గదుల్లో ఎక్కువసేపు ఉండటం వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఏసీ యంత్రాలను శుభ్రం చేయకపోతే ధూళి, అలెర్జీ కారకాలు, ఇతర సూక్ష్మకణాలు గాలిలో వ్యాపించే ప్రమాదం ఉంది. ఇవి కొందరిలో తుమ్ములు, అలెర్జీలు, శ్వాస ఇబ్బందులను పెంచవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారం ఏసీ ఉష్ణోగ్రతను అతిగా తగ్గించకుండా మితంగా ఉంచడం మంచిదని చెబుతున్నారు. తరచూ నీరు తాగడం, మధ్య మధ్యలో బయట గాలి పీల్చడం, గదుల్లో గాలి ప్రసరణ ఉండేలా చూడడం అవసరమని సూచిస్తున్నారు. కొన్ని నివేదికలు 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత సౌకర్యవంతంగా ఉండవచ్చని పేర్కొన్నాయి. ఏసీ ఇప్పుడు విలాసం కాదు, అవసరంగా మారిపోయింది. కానీ దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామనేదే ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. చల్లదనం కోసం తీసుకునే జాగ్రత్తలే కొన్నిసార్లు ఆరోగ్య సమస్యలకు కారణం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## కులగణనకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

జోక్యం ఉండదని ధర్మాసనం పేర్కొంది. సమాజంలో వెనుకబడిన వర్గాల సంఖ్య, వారి పరిస్థితులపై ప్రభుత్వానికి స్పష్టమైన సమాచారం ఉండాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలంటే ఆ వర్గాలకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు అవసరమని వ్యాఖ్యానించింది.

అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా చేరాలంటే కులగణన కీలక పాత్ర పోషిస్తుందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలంటే వారి సంఖ్య ప్రభుత్వానికి తెలియాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కులగణనకు వ్యతిరేకంగా పిటిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలను ధర్మాసనం తోసిపుచ్చింది. విధాన నిర్ణయాల్లో న్యాయపరమైన జోక్యానికి అవకాశం లేదని మరోసారి స్పష్టం చేసింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియకు చట్టపరమైన స్పష్టత వచ్చినట్లయిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాబోయే జనగణన ప్రక్రియలో కులాల లెక్కింపుపై ఇక ముందుకు వెళ్లేందుకు మార్గం సుగమమైందని విశ్లేషకులు చెబుతున్నారు.

## సీఎం విజయ్ టెస్ట్ డ్రైవ్ హల్‌చల్

ఆ సంప్రదాయానికి భిన్నంగా నేరుగా స్టీరింగ్ పట్టడం అందరినీ ఆకట్టుకుంది. బ్లాక్ రంగు దుస్తుల్లో విజయ్ కనిపించిన తీరు అభిమానులను విశేషంగా ఆకర్షించింది. జీప్ నడుపుతూ కనిపించిన ఆయన వీడియోలను అభిమానులు పెద్ద ఎత్తున పంచుకుంటున్నారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా ప్రజలకు చేరువయ్యే వ్యక్తిగా విజయ్ వ్యవహరిస్తున్నారంటూ నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. తమిళనాడులో ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలను మరింత వేగంగా అందించేందుకు ఈ ప్రత్యేక వాహనాలను రూపొందించినట్లు తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను త్వరగా ఆసుపత్రులకు తరలించేందుకు వీటిని వినియోగించనున్నారు. వాహనంలోని సదుపాయాలను స్వయంగా పరిశీలించడం ద్వారా ప్రజారోగ్యంపై విజయ్‌కు ఉన్న శ్రద్ధ కనిపిస్తోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాలతో పాటు ప్రజా సేవల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## పోక్సో కేసుపై స్పందించిన బండి సంజయ్

పార్టీ కార్యకర్తల గురించి కూడా ఆయన మాట్లాడారు. బీజేపీలో ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేసే వ్యక్తేనని పేర్కొన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు తమ జీవితాన్ని సిద్ధాంతాలకు అంకితం చేస్తారని అన్నారు. రాజకీయ ప్రత్యర్థుల విమర్శలపై స్పందించిన బండి సంజయ్, తనపై కొన్ని పార్టీలు ఉద్దేశపూర్వక ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. తమ పార్టీని లక్ష్యంగా చేసుకుని రాజకీయ దాడులు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

ఇతర పార్టీల నాయకులు తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని చేస్తున్న డిమాండ్లపై కూడా ఆయన స్పందించారు. ప్రత్యర్థి పార్టీలకు ప్రజల్లో ఆదరణ తగ్గిందని, అందుకే ఇలాంటి ఆరోపణలకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కె. చంద్రశేఖర్ రావు కుటుంబ పాలనపై కూడా విమర్శలు చేశారు. తమ పార్టీ ఆ కుటుంబ పాలనను ఎదుర్కొని ప్రజల ముందుకు తీసుకువచ్చిందని, అందుకే తమపై అసత్య ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. అయితే ఈ వ్యవహారంపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## బంగ్లాదేశ్‌లో భారత అధికారి మృతి

అంతస్తులోని స్నానాల గది ద్వారం సమీపంలో నరేన్ మృతదేహం కనిపించిందని సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. దౌత్య అధికారికి సంబంధించిన కేసు కావడంతో ప్రత్యేక నిబంధనలను పాటిస్తూ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మృతదేహాన్ని చట్టోగ్రామ్ వైద్య కళాశాల ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ప్రాథమికంగా గుండెపోటు కారణంగా మృతి సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఘటనలో ప్రస్తుతం అనుమానాస్పద అంశాలు కనిపించలేదని చెబుతున్నప్పటికీ అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. నరేన్ ధర్ భారతదేశంలోని చండీగఢ్‌కు చెందిన వ్యక్తిగా సమాచారం ఉంది. ఈ ఘటనపై ఢాకాలోని భారత రాయబార కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సంఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# తెలంగాణలో జీసీసీల విస్తరణకు కొత్త దిశ



హైదరాబాద్, మే 20 తెలంగాణలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పెరుగుతున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, జీసీసీలను కేవలం హైదరాబాద్‌మహానగరానికే పరిమితం చేయకుండా జిల్లాలకు కూడా విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖలకు సంబంధించిన అంశాలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఒకే నగరానికి పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక జీసీసీ విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి బయట ప్రాంతాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు ఏర్పాటయ్యేలా కొత్త విధానాలు తీసుకురావాలని సూచించారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారుల వెంట ఐటీ సంస్థలకు అనువైన ప్రాంగణాలను గుర్తించి, వాటికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఐటీ రంగాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు “బియాండ్ కోర్ అర్బన్ రీజియన్” ప్రాంతాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం అభివృద్ధి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ల ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించడంతో పాటు జిల్లాల్లో ఉద్యోగ అవకాశాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న “భారత్ ఫ్యూచర్ సిటీ”లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే నెట్-జీరో విధానాలు తప్పనిసరిగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. అదే విధంగా ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకదాన్ని ఫ్యూచర్ సిటీలోని హెల్త్ సిటీలో ఏర్పాటు చేసే అవకాశాలపై చర్చించాలని సూచించారు. అవసరమైతే ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదించిన ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి సదుపాయాలతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగిన నగరంగా దీనిని తీర్చిదిద్దాలని అన్నారు. అలాగే ఇండస్ట్రియల్ కారిడార్‌లో కంపెనీల స్థాపనకు అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని ఆదేశించారు.

రాష్ట్రంలో పెట్టుబడులను మరింత ప్రోత్సహించేందుకు “ఇన్వెస్ట్ తెలంగాణ” పేరిట ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పెట్టుబడిదారులకు మొదటి నుంచి చివరి దశ వరకు అవసరమైన సేవలు అందించే విధంగా ఈ సంస్థ పనిచేయాలని తెలిపారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణకు వచ్చినప్పటి నుంచి ప్రాజెక్టు ప్రారంభం వరకు వారికి సహాయపడేందుకు ప్రత్యేక ఎస్కార్ట్ అధికారులను నియమించాలని సూచించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడంలో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలవాలని సీఎం పేర్కొన్నారు.

మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను టి-ఫైబర్ ఇంటర్నెట్ సేవలకు అనుసంధానం చేయాలని కూడా ఆదేశించారు. ప్రైవేట్ నెట్‌వర్క్‌ల స్థానంలో ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. గత ఆరు నెలల్లో టి-ఫైబర్ వినియోగం ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం వచ్చినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొని వివిధ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. తెలంగాణను పెట్టుబడులు, సాంకేతికత, ఉద్యోగ అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దూకుడుగా ముందుకెళ్తోందని అధికారులు తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వడగాలుల ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతంలో అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడడంతో పాటు విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఆరోగ్య శాఖ అధికారులు కూడా పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే వారికి వెంటనే వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో అవసరమైన మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను వేగంగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. ముఖ్యంగా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

మధ్యాహ్న సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయకుండా ఉండాలని ప్రజలకు సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఎండలో ఎక్కువసేపు తిరగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జిల్లా కలెక్టర్లకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును ఆదేశించారు. వడగాలుల ప్రభావాన్ని తగ్గించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

### ఆలయంలో ప్రత్యేక పూజలు



వరంగల్ ప్రతినిధి , మే 20, తరంగాలు :తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ ప్రధాన అర్చకులు శేష ఆధ్వర్యంలో ఈవో, వేద పండితులు, అధికారులు, మరియు ప్రజాప్రతినిధులు పూర్ణకుంభంతో, మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు.స్వాగత మర్యాదల అనంతరం మంత్రి గర్భాలయంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె అమ్మవారిని వేడుకున్నారు.దర్శనానంతరం



ఆలయ మండపంలో వేద పండితులు మంత్రి కొండా సురేఖ కు వేదాశీర్వచనం అందజేశారు.ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను మంత్రికి బహూకరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## డీఆర్డీవో క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, మే 20 : భారత రక్షణ పరిశోధన రంగంలో మరో కీలక ఘట్టం నమోదైంది. డీఆర్డీవో అత్యాధునిక యూఎల్‌పీజీఎం-వీ3 క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. గగనతలం నుంచి భూమిపై ఉన్న లక్ష్యాలతో పాటు గగనతలంలోని లక్ష్యాలను కూడా ఖచ్చితంగా ఛేదించే సామర్థ్యాన్ని ఈ పరీక్ష ద్వారా ప్రదర్శించారు. ఈ విజయంతో భారత రక్షణ రంగం మరింత బలోపేతం కానున్నట్లు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఉన్న డీఆర్డీవో పరీక్షా కేంద్రంలో ఈ కీలక పరీక్షను నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ గ్రౌండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ప్రయోగాన్ని నిర్వహించినట్లు రక్షణ శాఖ ప్రతినిధులు వెల్లడించారు. జీసీఎస్ కమాండ్, కంట్రోల్ సాంకేతికతతో క్షిపణి ప్రయోగ కార్యకలాపాలను పర్యవేక్షించినట్లు తెలిపారు.

ఈ అత్యాధునిక ఆయుధ వ్యవస్థ అభివృద్ధిలో అనేక సంస్థలు కలిసి పనిచేశాయి. హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీ లిమిటెడ్ సంస్థలతో కలిసి డీఆర్డీవో సంయుక్తంగా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లింది. డ్రోన్ ఆధారిత క్షిపణుల తయారీ, అభివృద్ధిలో ఈ సంస్థలు కీలక పాత్ర పోషించాయి. బెంగళూరుకు చెందిన న్యూస్పేస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చేసిన యూఏవీలను కొత్త ఆయుధ వ్యవస్థలో అనుసంధానం చేశారు. దీని ద్వారా క్షిపణి సామర్థ్యాలను మరింత మెరుగుపరిచినట్లు అధికారులు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ ఆయుధం భవిష్యత్ యుద్ధ వ్యూహాల్లో కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

యూఎల్‌పీజీఎం క్షిపణిని హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ అభివృద్ధి చేసింది. డీఆర్డీవో, డీఆర్డీఎల్‌తో పాటు చండీగఢ్‌లోని టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ ల్యాబ్, పుణెలోని హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబ్ కూడా ఇందులో భాగస్వామ్యమయ్యాయి. సూక్ష్మ, చిన్న పరిశ్రమల సహకారంతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భారీ స్థాయిలో క్షిపణుల ఉత్పత్తికి మార్గం సుగమమైందని రక్షణ శాఖ ప్రతినిధులు వెల్లడించారు. ఈ విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేస్తూ డీఆర్డీవో బృందాన్ని అభినందించారు. డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వీ కామత్ కూడా ఈ ఘనత వెనుక పనిచేసిన ప్రతి ఒక్కరిని ప్రశంసించారు.

## గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

న్యూఢిల్లీ,మే 20 బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతో పాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో సమావేశమయ్యారు . ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్?ఎఎ మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా, భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే, సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ చరిత్రలో చెరగని సంతకం

• ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్ బాబుకి జన్మదిన శుభాకాంక్షలు



తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం ప్రెస్ క్లబ్ చరిత్రలో...చెరగని సంతకం మీది! కలం పట్టిన చేతికి... ఒక ఆశయం తోడైతే అది అక్షరమై గర్జిస్తుంది. ఉద్యమాలు నీకు కొత్త కాదు...విద్యార్థి దశలోనే స్టూడెంట్ యూనియన్ లీడర్ గా పోరాటాలు చేసిన చరిత్ర నీది! వార్తలు రాసే చేతికి ... ఒక గూడు దక్కాలని ముఖ్యమంత్రి సభలో గళమెత్తిన ధీశాలి మీరు!అధికార పార్టీలకెన్నడు అంటగాగని నిఖార్సైన అడుగులు నీవి, ప్రెస్ క్లబ్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దిన శ్రామికుడవు!చెట్టు చెట్టుకు ప్రాణం పోస్తూ.. హరితవనం చేసావు.పాత గోడల మురికి వదిలించి.. రంగుల లోకం చేసావు!విరిగిన కుర్చీలకు వెల్డింగ్ పెట్టించి బాధ్యతను నిలబెట్టావు. వైఫై వెలుగులతో.. అక్షర వేగాన్ని పెంచావు!నీవు మాటల మనిషి కాదు.. చేతల చాంపియన్! పరిశుభ్రతలో 'ఎస్కో బ్రో' మంత్రం చదివిన యోధుడవు!శత్రువు సైతం సలాం కొట్టే క్రమశిక్షణ నీ సొంతం!అవినీతి చీకటిని చీల్చుతూ.. అక్షర యుద్ధం చేసే జర్నలిస్టులకు పారదర్శకంగా నీతికి నిలువుటద్దమై నిలిచారు!దాపరికం లేని ధైర్యం మీది,అణా పైసల లెక్కలను అద్దంలా చూపారు.'శ్వేత పత్రం' విడుదల చేసి.. సరికొత్త చరిత్రకు పునాది వేశారు.చరిత్రలో ఎన్నడూ లేని విధంగాఒక నూతన అధ్యాయానికి నాంది పలికారు!జర్నలిస్టుల ఆత్మగౌరవ శిఖరంగా మీ ప్రయాణం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

# మహిళ హత్య కేసును చేధించిన పోలీసులు

• నిందితుడు అరెస్ట్

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన వైరా ఏసీపీ సారంగపాణి**




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** మధిర రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం గ్రామం నక్షత్ర ఓపెన్ వెంచర్ ప్రాంతంలో మే 15 న జరిగిన మహిళ హత్య కేసును మధిర రూరల్ పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. కేసు వివరాల ప్రకారం మే 16 న గోపిశెట్టి సాయిరామ్ అలియాస్ సాయి అనే వ్యక్తి తన అక్క గోపిశెట్టి కల్పన (28), నివాసం మేడూరు గ్రామం, గంపలగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా, కనిపించడం లేదని, కల్పన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ప్రతిరోజు లాగే మే 15 న ఉదయం మేడూరు నుండి మధిరకు విధులకు వెళ్తున్నానని ఇంటి నుండి బయలుదేరిన కల్పన ఆ రోజు కార్యాలయానికి హాజరు కాలేదని సహోద్యోగి ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందిందని, అదే రోజు యార్లగడ్డ చెన్నారావు అనే వ్యక్తి 'మీ అక్క నా దగ్గర ఉంది, మాట్లాడుకోవాలి'అంటూ ఫోన్ సందేశం పంపినట్లు ఫిర్యాదుదారు తెలిపారు.అనంతరం సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా గాలింపు చేపట్టగా,కృష్ణాపురం గ్రామ శివారులోని నక్షత్ర ఓపెన్ వెంచర్ ప్రాంతంలో కల్పన మృతదేహం లభ్యమైందని తెలిపారు.ఆమె మెడ,నోటి చుట్టూ చున్నీ బిగించి హత్య చేసినట్లు గుర్తించారు. మధిర రూరల్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని పేర్కొన్నారు.దర్యాప్తులో భాగంగా సాక్షులను విచారించగా,నిందితుడు యార్లగడ్డ అంకుశరావు అలియాస్ చెన్నారావు (30),కనుమూరు గ్రామం,గంపలగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా వాసి, మృతురాలితో సన్నిహిత సంబంధం కొనసాగించినట్లు వెల్లడైందన్నారు. వ్యక్తిగత సంబంధాల విషయంలో ఇద్దరి మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నట్లు విచారణలో తేలిందన్నారు.

కేసు నమోదు అనంతరం నిందితుడు కోసం (3) ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి మరియు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడుని అదుపులోకి తీసుకోడం జరిగిందని తెలిపారు.

మే 15 న నిందితుడు మృతురాలిని తన ద్విచక్ర వాహనంపై కృష్ణాపురం సమీపంలోని ఏకాంత ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదంలో, తమ సంబంధం గురించి తన భార్యకు చెబుతానని మృతురాలు హెచ్చరించడంతో,కోపోద్రిక్తుడైన నిందితుడు చున్నీతో ఆమె మెడ బిగించి హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. మే 20 వ తేదీన అంబరుపేట వెంచర్ ప్రాంతంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి, అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు. వ్యక్తిగత సంబంధాల పేరుతో మోసపోయే పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిచయాలు, వ్యక్తిగత సంబంధాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద ప్రవర్తన గమనించిన వెంటనే కుటుంబ సభ్యులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏకాంత ప్రాంతాలకు వెళ్లడం, వ్యక్తిగత విషయాలపై వివాదాలు తీవ్రరూపం దాల్చే పరిస్థితులను నివారించాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.మధు,మధిర రూరల్ ఎస్ఐ బి.లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.

# బక్రీద్ సందర్బంగా ముస్లిం మత పెద్దలతో పోలీసుల సమావేశం

•బక్రీద్ సందర్భంగా అనుమతించిన జంతువులను మాత్రమే బలి ఇవ్వాలి




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** :

ఖమ్మం : రానున్న బక్రీద్ పండుగను శాంతియుతంగా, మత సామరస్యంతో జరుపుకోవాలని టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ముస్లిం మత పెద్దలతో, మసీదు కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఏసీపీ మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణ, పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, సామరస్య వాతావరణం ఉండేలా చూడాలని పోలీసులు ముస్లిం పెద్దలను కోరారు. అక్రమ పశు వుల రవాణాను అరికట్టడానికి చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు లోబడి, సరైన ధృవీకరణ పత్రాలతో మాత్రమే జంతువులను తరలించాలని సూచించారు. గోవధ చేయవద్దని, కేవలం అనుమతించబడిన జంతువులను మాత్రమే బలి ఇవ్వాలని సూచించారు.అదేవిదంగా జంతు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా,మున్సిపల్ అధికారుల సహకారంతో వాటిని తొలగించాలని, శుభ్రత పాటించాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వార్తలు, వదంతులు వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సమావేశంలో ఇన్స్పెక్టర్ కరుణాకర్,మోహన్ బాబు, బాలకృష్ణ, ఎస్సై లు పాల్గొన్నారు.

# పోలీసు శాఖలో ఎస్సై రహీం సేవలు మరువలేనివి



**పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో కామేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు**

తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం : పోలీస్ శాఖలో మచ్చ లేకుండా, ఉన్నతాధికారులతో, ఎలాంటి విభేదాలు లేకుండా, రాజకీయ నాయకులను కూడా సమన్వయం చేసుకుంటూ, సమాజసేవే పరమావధిగా భావించి పోలీస్ శాఖలో ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న మంచి వ్యక్తి ఎస్సై రహీం

సేవలు మరువలేనివని కామేపల్లి మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

బుధవారం కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, ఏపూరి మహేందర్, టి పి సి సి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం తదితర నాయకుల ఆధ్వర్యంలో ఎస్సై రహీం జరీనా బేగం దంపతుల పదవి విరమణ సన్మాన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సక్రమంగా విధి నిర్వహణను కొనసాగిస్తూ దాదాపు 40 సంవత్సరముల పాటు మచ్చలేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఉదార స్వభావులుగా పేరు తెచ్చుకున్న రహీం జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో పని చేశారని,1986లో పేరూరు వద్ద గోదావరి వరదలలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడటం, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో గాలింపు చర్యల్లో భాగంగా అడవిలో తిరగటం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో అత్యంత చొరవ చూపడం,2015 నుండి ఇంటిలిజెన్సీ వ్యవస్థలో పనిచేసే ఎన్నికలు ముఖ్యమైన సందర్భాలలో ప్రత్యేక గుర్తింపు పొంది బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. తదనంతరం సన్మాన గ్రహీత రహీం మాట్లాడుతూ ఈరోజు మీరంతా నాపై చూపిన వాత్సల్యము ప్రేమ, సన్మాన సత్కారములు జీవితంలో వెలకట్టలేనివని, పోలీసు శాఖలో నేను చేసిన సేవలకు నాకు లభించిన ఈ అదృష్టాన్ని ఎన్నటికీ మరువలేని కృతజ్ఞత భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య, కొమ్మనేపల్లి గ్రామ సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, మాజీ ఉపసర్పంచ్ ధరావతలాలు నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు,రాయల లక్ష్మయ్య,ఇల్లందు ఏం ఎం సి డైరెక్టర్ గుగులోతు గబ్రు నాయక్, గట్టి కొప్పుల నారాయణరెడ్డి దామోదర్ రెడ్డి, ఇమ్మడి రామనాథం, కాట్రాల వీరబాబు, హట్కర్ శంకర్,బానోత్ రాందాస్-సునీత,రాయల ఉపేందర్,భూక్యా కిషన్,పాటిబండ్ల ప్రసాద్,గుగులోత్ రవి, బండి ఉపేందర్, బాధవత్ నాగరాజు,ఎస్ కే రబ్బానీ పాషా,శీలం పుల్లయ్య, చల్ల మల్లయ్య ఉప్పుగండ్ల భద్ర రావు, అయితనబోయిన విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు పంచాయతీ కార్యదర్శి సస్పెండ్



పాలేరు ఆర్సీ, మే 20 (తరంగాలు) : కూసుమంచి మండలంలోని పాలేరు గ్రామపంచాయతీ కార్యదర్శి హరీష్ ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో టీ జశ్వంత్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కార్యదర్శి హరీష్ పై ప్రజాపాలన ప్రగతి నివేదిక గ్రామసభ నిర్వహించడంలో ప్రభుత్వ విధివిధానాలు పాటించలేదని ఆరోపణలు రావడం, ఇంటి మ్యూటేషన్ వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు వార్త కథనాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ విచారణకు ఆదేశించారు. విచారణ చేపట్టిన జిల్లా అధికారులు నివేదిక సమర్పించడంతో మే 8వతేదీన హరీష్ ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ విషయంపై సంబంధిత కార్యదర్శి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు విధులకు దూరంగా ఉంటారని ఆయన తెలిపారు. ప్రస్తుతం భగత్ వీడు గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు ని ఇన్ చార్జ్ గా వ్యవహరిస్తారని ఎంపీడీవో వివరించారు.

# మత్స్యకారులు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి




పాలేరు ఆర్సీ, మే 20 (తరంగాలు) : మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో, భారతీయ వ్యవసాయ, పరిశోధన మండలి, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్, షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్యకారులకు జరుగుతున్న జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం 3వ రోజు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది మత్స్య కారులు హాజరైనారు. బుధవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ పి. శివ ప్రసాద్, ఖమ్మం జిల్లా మత్స్య శాఖ అధికారి గారు మాట్లాడుతూ.... తెలంగాణ మత్స్యకారులు, మత్స్య రైతులు ఆక్వాకల్చర్ రంగంలో ముందుకు రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సబ్సిడీ పథకాలతో పాటు బ్యాంకులలో రైతులకు ఉండే వివిధ పథకాలు, లోన్లను కూడా ఉపయోగించుకొని ఆక్వా రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ సీనియర్ మత్స్య శాస్త్రవేత్త, అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు వారు మాట్లాడుతూ..జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతుల మీద ఇక్కడ నేర్చుకున్న ప్రతి విషయాన్ని మన తెలంగాణ మత్స్య రైతులు ఆచరణలో పెట్టి మంచి లాభాలని పొందాలని కోరారు అలాగే ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశాన్ని మీ తోటి సహచరులకు మిత్రులకు కూడా తెలియపరచాలని కోరారు. పి. శాంతన్న, పిహెచ్డి స్కాలర్, ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ మాట్లాడుతూ..దడి, పంజరపు చేపల పెంపకంలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి మత్స్యకారులకు క్లుప్తంగా వివరించారు. సిగ నాగరాజు యంగ్ ప్రొఫెషనల్, మత్స్య పరిశోధన స్థానం పాలేరు గారు మాట్లాడుతూ..చెరువులలో చేపలకు సర్వసాధారణంగా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి, వాటి నివారణ మార్గాల గురించి తెలంగాణ మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. బానోతు దివ్య, యంగ్ ప్రొఫెషనల్, మత్స్య పరిశోధన స్థానం పాలేరు వారు మాట్లాడుతూ..నాస్పాడ్ రిపోర్ట్ ఫిష్ డిసీజ్ యాప్ విశిష్టతను తెలుపుతూ ఆ యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. యాప్ ని డౌన్లోడ్ చేపించి చేపల వ్యాధులను ఎలా నివారించాలో క్లుప్తంగా వివరించడం జరిగింది. చివరిగా ప్రశంస పత్రాలను తెలంగాణ మత్స్యకారులకు అందించారు.

# ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

**పాలేరు ఆర్సీ, మే 20 (తరంగాలు) :** కూసుమంచి



మండలకేంద్రంలో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను అభిమానులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో జనాలకు, ప్రయాణీకులకు మజ్జిగ పంపిణీ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో తమ అభిమాన హీరో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తాము అభిమానించే నటుడు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భగవంతున్ని కోరినట్లు అభిమానులు తెలిపారు. తమ అభిమాన నటుడు రానున్న కాలంలో ఎన్నో సమాజానికి ఉపయోగపడే సందేశం ఇచ్చే సినిమాలు తీయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐతగాని నవీన్, అడపా శివ(కరాటే శివ), తహీద్ హుస్సేన్, సతీష్, ఉదయ్, సాయి, నాగరాజు, రామకృష్ణ, వినయ్, ఫ్యాన్స్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

**కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ మే 20
ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి ఎక్కువ పని దినాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం 5 గంటలకే పనిస్థలాలకు చేరుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్లు, మహిళా సంఘ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జాబ్‌కార్డు కార్మికుల హాజరు పెంచి కనీసం 40 రోజుల ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# ఏఐఓసిడి పిలుపుమేరకు ఇల్లందులో మెడికల్ షాపుల బంద్ విజయవంతం

- బందుకు స్వచ్ఛందంగా సహకరించిన అపోలో, మెడిప్లస్ సంస్థలు
- పట్టణంలో భారీ ర్యాలీ.

ఆన్లైన్ మందులు రద్దు చేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు వినతి పత్రం




ఇల్లందు ప్రతినిధి మే 20, ( తరంగాలు): ఆన్లైన్ మందులు అమ్మకాలను రద్దు చేయాలని, కార్పొరేట్ సంస్థలకు డిస్కౌంట్ ఇవ్వవద్దని, మచిలీ మందులు అరికట్టాలని ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు బుధవారం తలపెట్టిన మందుల షాపు బంద్ ఇల్లందులో విజయవంతంగా ముగిసింది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అసోసియేషన్ బాధ్యులు చర్యలు చేపట్టారు. ఈ బందుకు కార్పొరేట్ సంస్థలైన స్థానికంగా ఉన్న రెండు అపోలో మందుల షాపులు, ఒక మెడిప్లస్ మందుల షాపులు స్వచ్ఛందంగా బంద్ చేసి సహకరించారు. అసోసియేషన్ బాధ్యులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇల్లందు యూనిట్ లోని గుండాల మండలంలో, ఆళ్లపల్లి మండలంలో, ఇల్లందు మండల పరిధిలో అన్ని ప్రాంతాల్లో ఉన్న మెడికల్ షాపులు బంద్ లో పూర్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు మెడికల్ షాప్ బాధ్యులంతా కలిసి మెమోరండం అందజేశారు. ఇల్లందులో జరిగిన బంద్ కు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్పర్సన్ కిరణమిత్ర ,స్థానిక డిఎస్పి వెంకన్న బాబు, స్థానిక సీఐ సురేష్ కుమార్, రెవెన్యూ అధికారులు సహకారం అందించారు.



# గంగాదేవి గుట్టలో అక్రమ మైనింగ్ యత్నం

**మైనింగ్ శాఖ, ఎంఆర్వో చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్**

**కారేపల్లి టౌన్ తరంగాలు న్యూస్ మే 20**
కారేపల్లి మండలంలోని గుట్టకింద గుంపు పంచాయతీ పరిధిలో ఉన్న గంగాదేవి గుట్టను మైనింగ్, గోదాం నిర్మాణం పేరుతో అక్రమంగా త్రవ్వి మట్టిని తరలించేందుకు సంబంధిత కాంట్రాక్టర్ మరోసారి ప్రయత్నించిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. ఈ రోజు జేసీబీ యంత్రాలతో గుట్ట వద్దకు చేరుకున్న కాంట్రాక్టర్ తవ్వకాలు ప్రారంభించేందుకు యత్నించగా, విషయం గమనించిన గ్రామస్థులు వెంటనే అడ్డుకున్నారు. గ్రామస్థుల నిరసనతో జేసీబీలను వెనక్కి






తీసుకుని కాంట్రాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. ప్రకృతికి ఆభరణంగా నిలిచిన పచ్చటి గంగాదేవి గుట్టను మైనింగ్ పేరుతో ధ్వంసం చేయాలని చూస్తే సహించబోమన్నారు. అక్రమ తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారులు, ఎంఆర్వో వెంటనే జోక్యం చేసుకుని సంబంధిత కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి గుట్టను పరిరక్షించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో ఎస్సై రహీం సేవలు మరువలేనివి

- పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో కామేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు
- ఇల్లందు ప్రతినిధి మే 20, ( తరంగాలు):



పోలీస్ శాఖలో మచ్చ లేకుండా, ఉన్నతాధికారులతో, ఎలాంటి విభేదాలు లేకుండా , రాజకీయ నాయకులను కూడా సమన్వయం చేసుకుంటూ, సమాజసేవే పరమావధిగా భావించి పోలీస్ శాఖలో ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న మంచి వ్యక్తి ఎస్సై రహీం సేవలు మరువలేనివని కామేపల్లి మండలానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, ఏపూరి మహేందర్, టి పి సి సి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం తదితర నాయకుల ఆధ్వర్యంలో ఎస్సై రహీం - జరీనా బేగం దంపతుల పదవి విరమణ సన్మాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సక్రమంగా విధి నిర్వహణను కొనసాగిస్తూ దాదాపు 40 సంవత్సరముల పాటు మచ్చలేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, ఉదార స్వభావులుగా పేరు తెచ్చుకున్న రహీం జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో పని చేశారని, 1986లో పేరూరు వద్ద గోదావరి వరదలలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడటం, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో గాలింపు చర్యల్లో భాగంగా అడవిలో తిరగటం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో అత్యంత చొరవ చూపడం,2015 నుండి ఇంటిలిజెన్సీ వ్యవస్థలో పనిచేసే ఎన్నికల సందర్భాలలో ప్రత్యేక గుర్తింపు పొంది బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. అనంతరం సన్మాన గ్రహీత రహీం మాట్లాడుతూ, ఈరోజు మీరంతా నాపై చూపిన వాత్సల్యము ప్రేమ, సన్మాన సత్కారములు జీవితంలో వెలకట్టలేనివని, పోలీస్ శాఖలో నేను చేసిన సేవలకు నాకు లభించిన ఈ అదృష్టాన్ని ఎన్నటికీ మరువలేని కృతజ్ఞత భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య, కొమ్మనేపల్లి గ్రామ సర్పంచ్ ధరావత్ అనురాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, మాజీ ఉపసర్పంచ్ ధరావతలాలు నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు,రాయల లక్ష్మయ్య,ఇల్లందు ఏం ఎం సి డైరెక్టర్ గుగులోతు గబ్రు నాయక్, గట్టి కొప్పుల నారాయణరెడ్డి దామోదర్ రెడ్డి, ఇమ్మడి రామనాథం, కాట్రాల వీరబాబు, హట్కర్ శంకర్, భానోత్ రాందాస్ -సునీత, రాయల ఉపేందర్,భూక్యా కిషన్,పాటిబండ్ల ప్రసాద్, గుగులోత్ రవి, బండి ఉపేందర్, బాధవత్ నాగరాజు,ఎస్ కే రబ్బానీ పాషా,శీలం పుల్లయ్య, చల్ల మల్లయ్య ఉప్పుగండ్ల భద్ర రావు, అయితనబోయిన విఠల్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు



- బిఆర్ఎస్ మండల కార్యాలయంలో కేక్ కట్ చేసిన శ్రేణులు

కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మే. 20, తరంగాలు:బుధవారం బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించి వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజల సంక్షేమ ప్రదాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆశీస్సులు శంకర్ నాయక్ కి ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ జన్మదిన వేడుకల సందర్భంగా బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.... మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ కి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు ఆశీస్సులు తెలియపరుస్తూ భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో తెలంగాణ ప్రాంతం అంతా సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుకుంటూ పార్టీ శ్రేణులు వేడుకలు నిర్వహించినారు. ప్రతి ఒక్క పౌరుడు కూడా తెలంగాణలో సుఖశాంతులతో విరాసిల్లాలని కోరుకున్నారు. భవిష్యత్తులో ప్రజా సంక్షేమం ప్రజలకు ఇబ్బంది కలిగితే బిఆర్ఎస్ పార్టీ పరంగా మేము ఉంటామని ప్రజలకు భరోసా కల్పించినారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగిన బి ఆర్ ఎస్ పార్టీ పరంగా ముందుండి పోరాటం చేస్తామని హామీ ఇచ్చినారు . ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ నజీర్ అహ్మద్ మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షులు గులోత్ వీరు నాయక్,జిల్లా నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి గారు మండల్ నాయకులు గూగులోత్ సునీల్ కుమార్ కౌన్సిలర్లు జాటోత్ సుజాత హరీష్ నాయక్,ఆగే రాము, పాయిరాల శరత్ కుమార్,దూదేపాక కృష్ణ, మేకల శారద సురేష్, రావుల వినయ్ రెడ్డి, సర్పంచులు ఏర్పుల సునీత కుమార్ కందునూరి ఉప్పలయ్య,పోలు వెంకన్న, మాజీ సర్పంచ్ కు ముఖ్య కార్యకర్తలు మండల కమిటీ బాధ్యులు ముఖ్య కార్యకర్తలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## స్నేహితుడి కుటుంబానికి 1987-88ఎస్ఎస్సి బ్యాచ్ ఆర్థిక సహాయం



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మే. 20, తరంగాలు**:ఇటీవల ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గద్దల ప్రభాకర్ అకాల మరణం చెందగా వారి కుటుంబానికి కేసముద్రం జడ్పీహెచ్ఎస్ పాఠశాల 1987-88 బ్యాచ్ స్నేహితులు అండగా నిలిచారు.గద్దల ప్రభాకర్ కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితులు, ముగ్గురు ఆడపిల్లలు కావడంతో ప్రభాకర్ చిన్ననాటి స్నేహితులు 18,500 ప్రభాకర్ భార్య అయిన సునీతకు అందజేశారు. అలాగే వారి స్నేహితులు ఎల్లవేళల ప్రభాకర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇవ్వడం జరిగింది.కష్టకాలంలో తోడుగా ఉన్న ప్రభాకర్ స్నేహితులకు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి పూర్వ విద్యార్థులు రాపాక వెంకట్ నారాయణ, కోమటిరెడ్డి పిచ్చిరెడ్డి మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్



**జఫర్గడ్ ప్రతినిధి, మే 20,(తరంగాలు)**:మండల కేంద్రం లోని వరి ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్ ఆకస్మికంగా పర్యటించి పరిశీలిస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి .ప్రధానంగా కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ బ్యాగుల లభ్యత, తేమ శాతం, హమాలీల అందుబాటు, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి అని అన్నారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఏ ఆర్ ఐ దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో
# ఇల్లెందులో సడక్ బంద్

- మొక్కజొన్న, వడ్లను కొనుగోలు చేయాలి
- దళారీలను కట్టడి చేయాలి




ఇల్లందు ప్రతినిధి మే 20,( తరంగాలు):మొక్కజొన్న,వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని, దళారీలను కట్టడి చేయాలని, మద్దతు ధర చెల్లించాలని, కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకెఎమ్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం ఇల్లందు న్యూడెమోక్రసీ కార్యాలయం నుండి వందలాది మంది రైతులు ప్రదర్శన నిర్వహించి కొత్త బస్టాండ్ సెంటర్లో సడక్ బంద్ నిర్వహించారు.ఈసందర్భంగా సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడుతూ,
కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న అవకతవకలపై గత నెల రోజులుగా రైతాంగం ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు.ప్రభుత్వం సకాలంలో వరిధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయకపోవడం వలన కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించకపోవడం వలన వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అకాల వర్షాలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణమే పంటలు కొనుగోలు చేయాలని,దళారీలను




అరికట్టాలని,కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించాలని, తడిసిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని, కళ్ళాల్లో ఉన్న ధాన్యానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.లేనియెడల రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్పందించడంతో ఇల్లెందు సిఐ జోక్యం చేసుకోని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో పొడుగు నరసింహారావు, సూర్ణపాక నాగేశ్వరరావు,పూనెం రంగయ్య,యదళ్ళపల్లి సత్యం,కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు,పర్శిక రవి, మూడు మాలు, మోకాళ్ళ కృష్ణ,జరుపుల కిషన్,భూక్యా మంగ్యా,వాంకుడోత్ మొతిలాల్, కల్తీ కోటమ్మ,నరాటి వెంకన్న,ఎల్. చిన్నస్వామి,గుర్రం యాదగిరి,సామెల్,గొగ్గెల రాజు,చింత నరసింహారావు, తేజావత్ లాలు,గూళ్ల సదయ్య, వాంకుడోత్ శ్రీను,తుడుం శ్రీను, బొమ్మెర్ల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాల నిండిన ప్రతి గౌడ బిడ్డకి లైసెన్స్ ఇవ్వాలి




**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 20,తరంగాలు**:జై గౌడ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గుదే వీరన్న గౌడ్ మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ వ్యాప్తంగా కొత్త పెన్షన్లు ఇస్తున్న సందర్భంగా ప్రతి గౌడ బిడ్డకి, గౌడ కుల సర్టిఫికెట్ ను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరికి లైసెన్స్ ఇవ్వాలి. గౌడబిడ్డ పుట్టుకతోనే గౌడ కాబట్టి తాటిచెట్టు ఎక్కిన వాళ్ళకి కాకుండా, గౌడ కుల సర్టిఫికెట్ ఉన్న అందరికి కూడా లైసెన్స్ ఇవ్వాలి. 50 సంవత్సరాలు పైబడి లైసెన్స్ లేని వారికి కూడా పెన్షన్కు అవకాశం కల్పించాలి. దీనిని ప్రభుత్వ పరిశీలించి ప్రతి గౌడ బిడ్డకు లైసెన్సులు,పెన్షన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో గౌడ కమ్యూనిటీ హాల్,గౌడ హాస్టల్ నిర్మించాలి. గౌడల అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుచున్నాము.

## ఘనంగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మే. 20,తరంగాలు**మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు శంకర్ నాయక్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తెల్ల శ్రీనివాస్, నాయిని రంజిత్ రెడ్డి, ఎండి ఫరీద్, కత్తుల ఎలేందర్, బాలు నాయక్,ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,జిల్లా నాయకులు, మండల నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, మాజీ వార్డు కౌన్సిలర్లు, వార్డ్ కౌన్సిలర్, పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. తదనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.

## దివ్యాంగులకు అండగా ప్రభుత్వం: సహాయక పరికరాలు అందజేసిన శాసనసభ్యులు

- దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం: శాసనసభ్యులు మురళి నాయక్



మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మే. 20,తరంగాలుమహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమం భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు మహబూబాబాద్ ఎమ్మెల్యే డా" భూక్య మురళి నాయక్ పాల్గొని దివ్యాంగులకు అవసరమైన పరికరాలను స్వయంగా వారి చేతుల మీదుగా అందజేశారు.ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ దివ్యాంగుల జీవితం సులభతరం కావడానికి అవసరమైన ట్రై సైకిళ్ళు, వీల్ చైర్లు,వాకింగ్ స్టిక్స్,మరియు శ్రావణ యంత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు..అంతే కాకుండా ప్రభుత్వ ప్రభుత్వ సంక్షేమ పథకాలను దివ్యాంగులకు మరియు అణగారినా వర్గాలకు చేరవేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు...వారికి సమాజంలో సమాన అవకాశాలు కల్పించడంలో ఇటువంటి పరికరాలు ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు.అంతేకాకుండా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో విద్య మరియు సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని నిరుపేదలకు,దివ్యాంగులకు అందుబాటులో ఉండడమే తమ ప్రధాన బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సత్యనారాయణ,స్థానిక వార్డు కౌన్సిలర్ కాటా భాస్కర్, వివిధ వార్డుల కౌన్సిలర్ లు జిల్లా నాయకులు , పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్న వేంసూర్ పోలీసులు

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం** : పేకాట ఆడుతున్న ఐదుగురిని వేంసూర్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు వేంసూర్ ఎస్సై కవిత తెలిపారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆదేశాల మేరకు వేంసూరు మండలం, కుంచపర్తి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచార మేరకు దాడులు నిర్వహించి ఐదుగురిని పట్టుకుని, వారి నుండి రూ. 6,800 నగదు, 6 మోటార్ సైకిళ్లు, 3 మొబైల్ ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ ఐ తెలిపారు.



## ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.



మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మే. 20,తరంగాలు:జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,సిరోలు మండలం, మన్నెగూడెం, మరిపెడ లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (ఫ్యాక్స్) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రాలలో ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాలు ప్రస్తుతం నిల్వ ఉన్న వివరాలు మిల్లులకు గోదాములకు పంపిన ధాన్యం వివరాల ఇన్వార్డ్ అవుట్ వార్డు రిజిస్టర్ ను, ట్యాబెట్ ఎంట్రీ, మాస్టర్ రైతులు , వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు,ఇప్పటికే మక్క జొన్న, ధాన్యం కొనుగోళ్ల లో ప్రత్యేక అధికారులు, తహసీల్దారులను నియమించడం జరిగిందని వారి పర్యవేక్షణలో ప్రతి ఒక్కరు ఒక కేంద్రానికి నిబద్ధత కలిగిన అధికారిని నియమించి ప్రతినిత్యం కొనుగోలు రవాణా విషయాలలో వేగంగా పనిచేస్తూ లక్ష్యాలను చేరుకునే దిశగా ఉన్నారని అదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.రైతులకు ఇబ్బంది కలిగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదని కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉండాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని, లోడింగ్ అన్లోడింగ్ లో వేగం పెంచాలని, సాధ్యమైనంత త్వరగా స్థానిక వాహనాలను హమాలీలను సమకూర్చుకొని ధాన్యాన్ని తరలించాలన్నారు, జిల్లాలో సరిపడంతా ప్రదేశాలు మిల్లులు, గోదాములలో ఉందని లారీ కాంట్రాక్టర్స్ ఆ దిశగా తరలించాలని సూచించారు, ఈ పర్యటన లో డిఆర్డిఓ ప్రాజెక్ట్ అధికారి మధుసూదన రాజు, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్, డిస్టిక్ మేనేజర్ నరసింహారావు, సిరోలు, మరిపెడ మండలాల తహసిల్దార్లు కృష్ణవేణి, పున్నం చందర్, తదితరులు ఉన్నారు.

## పోలీస్ నాకాబందీలో గంజాయి పట్టివేత

**ముగ్గురు అరెస్ట్ -- 2.395 కిలోల గంజాయి, కారు స్వాధీనం**




మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 20,తరంగాలు:మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీస్ నాకాబందీలో భాగంగా నెల్లికుదుర్ పోలీసులకు గంజాయి అక్రమ రవాణా కేసులో విజయం లభించింది. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 2 కిలోల 395 గ్రాముల ఎండు గంజాయి మరియు ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అరెస్ట్ అయిన నిందితులు ఏదుల రాజ్ కుమార్ గౌడ్, మాలేగోని అంజనేయులు, రామ్ గోని రాజేష్ కాగా,పరారీలో ఉన్న నిందితులు రాజ్ అలియాస్ ఎఫ్ జెడ్ మరియు రాజేష్‌గా పోలీసులు గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటూ డ్రైవింగ్ మరియు ఇతర పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి గంజాయి సేవించే అలవాటు ఉండటంతో పాటు, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి వ్యాపారంలోకి దిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది.నిందితులు నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుండి మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు నంబర్ టీజీ-09-టి-4658లో భద్రాచలం వెళ్లి, అక్కడ మరో వ్యక్తి ద్వారా సుమారు 2.4 కిలోల ఎండు గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అందులో కొంత భాగాన్ని తమ వినియోగానికి ఉంచుకుని, మిగిలిన గంజాయిని హైదరాబాద్‌లో అధిక ధరలకు విక్రయించి లాభాలు పొందాలని యత్నించినట్లు తెలిసింది.సూర్యాపేట మార్గంలో వెళితే పోలీసులు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని భావించి, మహబూబాబాద్ మార్గం ద్వారా హైదరాబాద్‌కు వెళ్లాలని నిందితులు నిర్ణయించుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.ఈ క్రమంలో మంగళవారం రాత్రి 9:45 గంటల సమయంలో నెల్లికుదుర్ మండలంలోని ఎం.కే.ఆర్ గార్డెన్స్ సమీపంలో నాకాబందీ నిర్వహిస్తున్న నెల్లికుదుర్ ఎస్ఐ సీహెచ్. రమేష్ బాబు మరియు సిబ్బంది అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, డిక్కీలో దాచిన గంజాయి ప్యాకెట్ బయటపడింది.పోలీసులు మొత్తం 2 కిలోల 395 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 1,19,750గా అంచనా వేశారు. అలాగే గంజాయి రవాణాకు ఉపయోగించిన కారును కూడా సీజ్ చేశారు.ఈ ఘటనపై నెల్లికుదుర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 116/2026 కింద ఎన్ డి పి ఎస్ చట్టం సెక్షన్ 8(సి) ఆర్ /డబ్ల్యు 20(బి)(ఐఐ)(బి) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.కేసముద్రం సిఐ వై. సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.ఈ కేసును ఛేదించి గంజాయి పట్టివేతలో ప్రతిభ కనబరిచిన కేసముద్రం సిఐ వై.సత్యనారాయణ, నెల్లికుదుర్ ఎస్ఐ సీహెచ్. రమేష్ బాబు మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి,ఐపీఎస్, మహబూబాబాద్ డిఎస్పీ ఎన్. తిరుపతి రావు ప్రత్యేకంగా అభినందించారు.

## ఓటిటిలోకి సతీ లీలావతి

మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల వివాహం తర్వాత వెండితెరపై నటించిన సరికొత్త రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం సతీ లీలావతి. మలయాళ నటుడు దేవ్ మోహన్ హీరోగా, 'భీమిలి కబడ్డీ జట్టు'వంటి చిత్రాల ఫేమ్ డైరెక్టర్ తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో, థియేట్రికల్ రన్ చాలా త్వరగానే ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఎవరూ ఊహించని విధంగా కేవలం 12 రోజుల వ్యవధిలోనే ఈ సినిమాను ఓటీటీ వేదికగా డిజిటల్ స్ట్రీమింగ్‌లోకి తీసుకువచ్చింది. మెగా ఫ్యామిలీకి చెందిన ఒక నటి నటించిన సినిమా ఇంత తక్కువ సమయంలో ఓటీటీ బాట పట్టడం టాలీవుడ్‌లో ఇదే మొదటిసారి కావడం విశేషం.

# చేయూత పెన్షన్ సర్వే, నరేగా పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి: స్పెషల్ సీఎస్ దాన కిషోర్

- రోజుకు 20 లక్షల మంది కార్మికులతో పనుల నిర్వహణ
- ప్రతి గ్రామంలో కనీసం 20 పనులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలి
- మెటరియల్ కాంపోనెంట్ నిధులను వచ్చే 40 రోజుల్లో వినియోగించాలి
- లైవ్ థెంటికేషన్ సర్వేతో కొత్త అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరుకు అవకాశం
- ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలి




**మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,మే. 20, తరంగాలు:** నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధికారులను ఆదేశించారు.బుధవారం, హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరయ్యారు.ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. నరేగా కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, ప్రణాళికలో ఉన్న అన్ని పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు.నరేగా పథకం జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని తెలిపారు.ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు నరేగా పనుల్లో పాల్గొంటుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల కోసం ముందురోజే కార్మికుల సమీకరణ చేపట్టాలని, పనులు గ్రామ హాబిటేషన్ పరిధిలోనే ఉండేలా చూడాలని, ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి, ప్రధాన పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రాబోయే 40 రోజుల పాటు ఎంపీడీవోలు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి సారించి పనులను వేగవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అసైన్డ్ భూముల్లో కూడా ఫామ్‌పాండ్‌ల నిర్మాణ పనులను చేపట్టి రైతులకు ఉపయోగకరంగా మలచాలని సూచించారు.ప్రతి రోజు ఉదయం వేళల్లో జిల్లా కలెక్టర్లు స్వయంగా ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ముఖ్యమంత్రి సుమారు 8 వేల వీవో భవనాలకు శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో రాబోయే 40 రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భవన పనులను బుక్ చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, మహిళా సంఘాల భవనాలు వంటి నిర్మాణాలను నరేగా కింద ప్రణాళిక చేయవచ్చని తెలిపారు.గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌ల శుభ్రత పనులను నిరంతరంగా చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ. 408.79 కోట్లకు పరిపాలనా అనుమతులు లభించగా, ఇప్పటివరకు రూ.65.20 కోట్ల మేర మాత్రమే క్లెయిమ్ చేయబడిందని, ఇంకా రూ.343.59 కోట్ల బ్యాలెన్స్ నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే 40 రోజుల్లో ఈ నిధులను ప్రాధాన్యతగా బుక్ చేసి పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి జిల్లాకు సగటున రూ.30 కోట్లకు పైగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించాలన్నారు.గత ఏడాది నీటి సంరక్షణ పనుల్లో పలువురు కలెక్టర్లు కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ ఏడాది మరింత ఎక్కువ పనులు జరుగుతున్నప్పటికీ పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయకపోవడంతో రాష్ట్రం ప్రస్తుతం 10వ స్థానంలో ఉందన్నారు. మనం చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్ పనుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.పనితీరు తక్కువగా ఉన్న మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని, నరేగా పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పనులను గుర్తించాలని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ వెంటనే కొత్త జాబ్ కార్డులు జారీ చేయాలని తెలిపారు.రాష్ట్రంలో మొత్తం 41 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, అందులో పోస్టల్ శాఖ ద్వారా 21 లక్షల మందికి నగదు రూపంలో పెన్షన్ పంపిణీ జరుగుతోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మరో 20 లక్షల మంది లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్ జమ అవుతోందన్నారు.ఫేస్ రికగ్నిషన్ విధానం అమలుతో మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన లబ్ధిదారుల కారణంగా ఇప్పటికే సుమారు 20 వేల పెన్షన్లు తగ్గినట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరికీ లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో నిర్వహించిన పైలట్ సర్వేలో సుమారు 9 శాతం మంది లబ్ధిదారులు మరణించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. లైవ్ అథెంటికేషన్ సర్వే పూర్తయ్యే సమయానికి కనీసం 5 శాతం మరణించిన లబ్ధిదారుల కేసులు గుర్తించినా మరో లక్ష మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.నగదు రూపంలో పెన్షన్ పంపిణీని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. పెద్దపల్లి, జగిత్యాల, కొత్తగూడెం, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో ఇంకా సుమారు 2 వేల పోస్టల్ పంపిణీలు మాత్రమే ఉన్నాయని, వాటిని కూడా బ్యాంకింగ్ విధానానికి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.దివ్యాంగుల సదరం కేంద్రాల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించాలని, తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా సదరం కేంద్రాలు ఏర్పాటు చేసి దివ్యాంగుల అంచనా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో సదరం కేంద్రాల్లో అవసరమైన సౌండ్ ప్రూఫ్ పరికరాలు, ఇతర ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 80 నుంచి 100 శాతం తీవ్ర దివ్యాంగత కలిగిన సుమారు 23 వేల మంది ఉన్నారని, కొత్త పింఛన్ల మంజూరులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలి

నిర్మల్ జిల్లాలో ఎన్‌పీఏలను పూర్తిగా సున్నాకి తగ్గించడం అభినందనీయమని పేర్కొన్నారు. జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు కూడా త్వరలోనే ఎన్‌పీఏలను జీరో స్థాయికి తీసుకురానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యంగా స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.స్త్రీనిధి రుణాల చెల్లింపులు, ఎన్‌పీఏల నియంత్రణపై ప్రతి నెల జిల్లా కలెక్టర్లు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలుకు సంబంధించి కొత్త జీవో విడుదలైందని, ఈ పథకం అమలు బాధ్యత గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం అమలుకు ఎంపీడీవోలే అధికారులని పేర్కొన్నారు. కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేద కుటుంబాలకు ఈ పథకం కింద రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. ఇతర బీమా పథకాల ప్రయోజనం లేని ప్రతి అర్హ కుటుంబానికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో రివ్యూ చేస్తూ....ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి పని కల్పించాలని.. ఎంపీడీఓ లకు లక్ష్యాలను నిర్దేశించారు.గ్రామీణ అభివృద్ధి ధ్యేయంగా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి జిల్లా కి మంచి పేరు తీసుకరావాలన్నారు .ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మునిసిపల్ కమిషనర్ లు ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఒక్క స్థానం కోసం 5 జట్ల మధ్య భీకర పోరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. లీగ్ దశ 24న ముగుస్తుంది. ఇప్పటి వరకు ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ప్లే ఆఫ్స్ చేరే నాలుగో జట్టు ఏదో తేలాల్సి ఉంది. మిగిలిన ఆ ఒక్క స్థానం కోసం ఏకంగా 5 జట్లు పోటీ పడుతున్నాయి. ప్లే ఆఫ్స్‌లో మిగిలి ఉన్న నాలుగో బెర్త్ కోసం రాజస్తాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, కేకేఆర్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య పోటీ నెలకొని ఉంది. లక్నోపై నెగ్గిన రాజస్తాన్ రాయల్స్ 14 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకోగా.. పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు చెరో 12 పాయింట్లతో ఉండగా.. కేకేఆర్ 11 పాయింట్లతో ఉంది.రాజస్తాన్, పంజాబ్, చెన్నై, ఢిల్లీ జట్లకు ఒక్కో మ్యాచ్ మిగిలి ఉండగా.. కేకేఆర్‌కు రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్లే ఆఫ్స్‌లో మిగిలి ఉన్న నాలుగో బెర్త్ ఈ ఐదు జట్లలో ఒకదానికి దక్కే ఛాన్స్ ఉంది. అధికారికంగా 5 జట్లు రేసులో ఉన్నా.. ప్రస్తుతం ఉన్న ఫామ్‌ను బట్టి చూస్తే ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఒక జట్టుకే ఎక్కువగా ఉన్నాయి.రాజస్థాన్ రాయల్స్ 14 పాయింట్లతో ప్రస్తుతం 4వ స్థానంలో ఉంది. ఒక మ్యాచ్ మిగిలి ఉంది. ముంబై ఇండియన్స్‌తో మే 24న పోరు ఉంది. ఇందులో నెగ్గితే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా రాజస్తాన్ రాయల్స్ నేరుగా ప్లే ఆఫ్స్ చేరుతుంది. అయితే ముంబైని ఓడించడం అంత సులభం కాదు. ఇక 5వ స్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్ ప్రస్తుతం 13 పాయింట్లతో ఉన్నాయి. పంజాబ్ కింగ్స్ తన చివరి మ్యాచ్‌ను ఈ నెల 23న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది. ఇందులో నెగ్గితే 15 పాయింట్లకు చేరుకుంటుంది. అప్పుడు చెన్నై, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తమ చివరి మ్యాచ్‌ల్లో నెగ్గినా ప్లే ఆఫ్స్‌కు చేరవు. ఎందుకంటే చెన్నై, ఢిల్లీ జట్లు చివరి మ్యాచ్‌ల్లో నెగ్గితే 14 పాయింట్లకు చేరుకుంటాయి. కానీ, పంజాబ్ ఖాతాలో 15 పాయింట్లు ఉంటాయి.ఇక కేకేఆర్ ప్లే ఆఫ్స్ చేరాలంటే చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పక నెగ్గాల్సి ఉంది. ముంబైతో ఈ నెల 20న ఆడనుంది. అనంతరం 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.

THARANGALU DAILY NEWS
గురువారం , 21 మే , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

(సంపాదకీయం)

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యతే అసలైన శక్తి

**ఉగ్రవాదం ఒక దేశ సమస్య కాదు.. ప్రపంచానికి సవాలు**



డెస్క్, మే 20 ( ప్రపంచ చరిత్రలో మానవ సమాజాన్ని తీవ్రంగా కుదిపేసిన సమస్యల్లో ఉగ్రవాదం ఒకటి. యుద్ధాలు రెండు దేశాల మధ్య జరుగుతాయి. రాజకీయ విభేదాలు చర్చల ద్వారా పరిష్కారం పొందవచ్చు. కానీ ఉగ్రవాదం మాత్రం భయాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ అమాయక ప్రజల జీవితాలపై నేరుగా దాడి చేస్తుంది. ఇది కేవలం ఒక ప్రాంతానికి, ఒక దేశానికి, ఒక ప్రభుత్వానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల భద్రత, శాంతి, ఆర్థిక వ్యవస్థ, సామాజిక ఐక్యతపై ప్రభావం చూపే పెద్ద సవాలు. అందుకే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం కేవలం భద్రతా సంస్థల బాధ్యత కాదు. ప్రతి పౌరుడు, ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి సమాజం కలిసి పోరాడాల్సిన అవసరం ఉంది.శాంతి విలువను గుర్తుచేసే జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంప్రతి సంవత్సరం మే 21న దేశవ్యాప్తంగా జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారు. ఈ రోజు వెనుక ఉన్న ఉద్దేశం కేవలం ఒక చారిత్రక సంఘటనను గుర్తు చేసుకోవడం కాదు. ఉగ్రవాదం ఎంత ప్రమాదకరమో ప్రజలకు తెలియజేయడం, యువతలో అవగాహన పెంచడం, దేశ ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రధాన లక్ష్యం. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే ప్రతిజ్ఞలు, సమావేశాలు, చర్చలు ప్రజల్లో బాధ్యత పెంచేందుకు ఉపయోగపడతాయి. ఉగ్రవాదం వల్ల కలిగే ప్రమాదాలు కేవలం ప్రాణనష్టంతో ముగియవు. దీని ప్రభావం తరతరాల వరకు కొనసాగుతుంది. ఉగ్రవాదం ఒక సంఘటనతో ప్రారంభమై ఒక వార్తతో ముగిసిపోదు. ఒక దాడి జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు వారి కుటుంబాలు జీవితాంతం మానసిక వేదనను అనుభవిస్తాయి. ఒక తండ్రిని కోల్పోయిన పిల్లవాడు, ఒక కుమారుడిని కోల్పోయిన తల్లి, ఒక భర్తను కోల్పోయిన భార్య జీవితాల్లో ఏర్పడే ఖాళీని ఎవరూ భర్తీ చేయలేరు. ఉగ్రవాదం నిజమైన నష్టం గణాంకాల్లో కనిపించదు. అది మనుషుల జీవితాల్లో మిగిలే బాధలో కనిపిస్తుంది.

– యువతను తప్పుదోవ పట్టించే ప్రమాదకర ధోరణులు

నేటి కాలంలో ఉగ్రవాదం రూపాలు కూడా మారుతున్నాయి. గతంలో ఆయుధాలు, శిక్షణ శిబిరాలు, ప్రత్యక్ష కార్యకలాపాలు ప్రధాన పాత్ర పోషించేవి. ఇప్పుడు డిజిటల్ ప్రపంచం కొత్త సవాళ్లను తీసుకువచ్చింది. సామాజిక మాధ్యమాలు, రహస్య ఆన్‌లైన్ వేదికలు, తప్పుడు ప్రచార వ్యవస్థల ద్వారా కొందరిని ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని భావోద్వేగాలను ప్రభావితం చేసే కంటెంట్ వ్యాప్తి అవుతోంది. ఉద్యోగ సమస్యలు, వ్యక్తిగత నిరాశలు, సామాజిక అసంతృప్తి, ఒంటరితనం వంటి పరిస్థితులను ఉపయోగించుకుని కొందరిని తీవ్ర భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిన్న సందేహం నుంచి మొదలయ్యే ఆలోచనలు కొన్నిసార్లు పెద్ద ప్రమాదంగా మారవచ్చు. అందుకే యువతలో విమర్శనాత్మక ఆలోచన, సరైన సమాచారం విశ్లేషించే సామర్థ్యం పెరగాలి. ప్రతి సమాచారం నిజమా కాదా అనే దానిపై ఆలోచించే అలవాటు అవసరం.

విద్యాసంస్థలు ఈ విషయంలో మరింత బాధ్యత తీసుకోవాలి. పాఠ్యాంశాల్లో విలువల విద్య, సామాజిక బాధ్యత, శాంతి, రాజ్యాంగ విలువలపై చర్చలు పెరగాలి. విద్య అనేది ఉద్యోగం పొందడానికి మాత్రమే కాదు. సరైన ఆలోచనా విధానాన్ని పెంచేందుకు కూడా ఉపయోగపడాలి. మంచి సమాజం నిర్మాణం తరగతి గదుల్లోనే ప్రారంభమవుతుంది. ఉగ్రవాదాన్ని ఒక మతంతో, ఒక వర్గంతో, ఒక ప్రాంతంతో అనుసంధానించడం అత్యంత ప్రమాదకరమైన ధోరణి. అలా చేయడం వల్ల సమాజంలో అనుమానాలు పెరుగుతాయి. పరస్పర విశ్వాసం దెబ్బతింటుంది. అదే ఉగ్రవాద శక్తులు కోరుకునే పరిస్థితి. ప్రజలు విభజించబడినప్పుడు విద్వేషం పెరుగుతుంది. విద్వేషం పెరిగితే హింసకు అవకాశాలు పెరుగుతాయి. అందుకే ప్రతి సందర్భంలో ఐక్యత, పరస్పర గౌరవం చాలా అవసరం.

భారతదేశం అనేక భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలతో కూడిన దేశం. భిన్నత్వంలో ఏకత్వం మన బలం. ఇలాంటి దేశంలో సామాజిక ఐక్యత చాలా ముఖ్యమైనది. ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో దేశ ప్రజలు కలిసి నిలబడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. కష్టకాలంలో ప్రజలు చూపిన ఐక్యతే భారతదేశం గొప్ప బలం. గతంలో జరిగిన అనేక ఉగ్రవాద దాడులు దేశాన్ని తీవ్రంగా కలచివేశాయి. కానీ ప్రతి సారి ప్రజలు భయపడకుండా ముందుకు సాగారు. దేశ భద్రతా బలగాలు ధైర్యంగా పోరాడాయి. సాధారణ ప్రజలు సహకరించారు. ఈ ఐక్యతే ఉగ్రవాదానికి సరైన సమాధానం అని కాలమే నిరూపించింది.– అప్రమత్త సమాజమే బలమైన రక్షణ కవచంప్రభుత్వాలు చట్టాలు తీసుకురాగలవు. భద్రతా సంస్థలు పర్యవేక్షణ పెంచగలవు. ఆధునిక సాంకేతికతను వినియోగించగలవు. కానీ సమాజం అప్రమత్తంగా లేకపోతే పూర్తి ఫలితం రాదు. అనుమానాస్పద విషయాలను గుర్తించడం, తప్పుడు సమాచారాన్ని నమ్మకపోవడం, బాధ్యతతో వ్యవహరించడం ప్రతి పౌరుడి కర్తవ్యం. జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం కేవలం ఒక రోజు నిర్వహించే కార్యక్రమం కాదు. అది ఒక ఆలోచన. అది ఒక బాధ్యత. అది ఒక హెచ్చరిక. హింస మనిషిని గెలిపించదు. భయం సమాజాన్ని నిలబెట్టదు. శాంతి, అవగాహన, ఐక్యత మాత్రమే దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో ఆయుధాల కంటే బలమైనది ప్రజల ఐక్యత. అదే దేశానికి అసలైన శక్తి.

# కటాక్షాపూర్ త్రికూట దేవాలయాల్లో ఘనంగా హెరిటేజ్ వాక్





- **కాకతీయుల చారిత్రక వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రజాప్రతినిధులు**

ఆత్మకూరు, మే 20,తరంగాలు : హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పరిధిలోని చారిత్రక కటాక్షాపూర్ హెరిటేజ్ త్రికూట దేవాలయాల వద్ద తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక “99 రోజుల కార్యాచరణ ప్రణాళిక -- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక”లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం “హెరిటేజ్ వాక్” కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పర్యాటక జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కటాక్షాపూర్ త్రికూటాలయం పరిసరాల్లో నిర్వహించిన హెరిటేజ్ వాక్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని దేవాలయ చారిత్రక విశిష్టతను పరిశీలించారు.ఈ సందర్భంగా త్రికూటాలయంలో నిర్వహించిన సభలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి చారిత్రక నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని అన్నారు. అలాంటి వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కటాక్షాపూర్ త్రికూట దేవాలయం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం తరపున ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఎంతో బాధ్యతతో ఆలయాన్ని సంరక్షిస్తున్నారని ప్రశంసించారు. అలాగే ఆలయ ప్రవేశద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణం చేపట్టేందుకు జిల్లా అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ చారిత్రక వారసత్వాన్ని కేవలం సంరక్షించడం మాత్రమే కాకుండా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా యువతకు చరిత్రపై అవగాహన పెంపొందుతుందని అన్నారు. కటాక్షాపూర్ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రముగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ కాకతీయుల నిర్మాణ శైలి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న చారిత్రక సంపదను ప్రజలకు పరిచయం చేయడం అవసరమని అన్నారు. కటాక్షాపూర్ త్రికూట దేవాలయం చారిత్రకంగా ఎంతో విలువైనదని, దీనిని పరిరక్షించేందుకు సంబంధిత శాఖలతో కలిసి చర్యలు చేపడతామని తెలిపారు.జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కటాక్షాపూర్ త్రికూటాలయంలో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు సమీప చెరువులో బోటింగ్ వంటి ఆకర్షణీయమైన కార్యక్రమాలు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో “హెరిటేజ్ వాక్” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, కటాక్షాపూర్ వంటి చారిత్రక ప్రాంతాలను రాష్ట్ర పర్యాటక పటంలో ప్రముఖ స్థానం కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్య కిరణ్ పర్యాటక ప్రేమికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## వరంగల్ ప్రభుత్వ నేత్ర వైద్య ఆసుపత్రికి మహర్దశ

- **అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ**
- **100 పడకలకు విస్తరణ, రూ. 1.73 కోట్లతో అత్యాధునిక పరికరాలు ప్రారంభం**





**వరంగల్ ప్రతినిధి,మే 20, తరంగాలు :** వరంగల్ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య ఆసుపత్రి ( ఆర్ ఇ హెచ్ ) అభివృద్ధిలో భాగంగా రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజ్ రిటైర్డ్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు.అనంతరం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్డీఎస్ ) సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం మంత్రి కొండా సురేఖ చేశారు.వరంగల్ రీజనల్ ఐ హాస్పిటల్‌ను అత్యాధునిక వైద్య సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.రోగులకు మెరుగైన సేవలందించడమే కాకుండా, ఆసుపత్రిని అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామన్నారు.. సిబ్బంది కొరత లేకుండా, అవసరమైన వైద్య పరికరాలను వెంటనే అందుబాటులోకి తెంచేందుకు కృషి చేస్తాం అని మంత్రి పేర్కొన్నారు.వరంగల్ చుట్టుపక్కల జిల్లాల వారికి ఈ ఆసుపత్రి కేరాఫ్ అడ్రస్‌గా మారాలన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఏజెన్సీ ద్వారా రిక్రూట్మెంట్ అయినా వర్కర్స్ విధినిర్వహణలో ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని, విధులకు భంగం కల్పించకుండా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించుటకు వైద్య అధికారులు ముందుండాలని ఈ సందర్భంగా మంత్రి గారు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఫ్రీ బస్సు వలన సుధీర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందించాలని, ఎవ్వరికీ అదనంగా డబ్బులు ఇవ్వరాదని బోర్డు లియర్పాటు చేయాలని మంత్రిగారు పేర్కొన్నారు.సికేఎం ఆస్పత్రి అభివృద్ధి లో భాగంగా వారు మాట్లాడుతూ నవ మాసాలు మోసిన తల్లికి బిడ్డ దక్కకపోతే ఆ తల్లి భాద వర్ణనాతీతమని, ప్రతి ఒక్క గర్భిణి అయినా ప్రతి మహిళ పుట్టింటి నుండి సాగనంపినట్లు గా 108 వాహనం ద్వారా ఆసుపత్రి నుండి వారి ఇంటికి చేర్చాలని ఈసందర్భంగా సి.ఎం సూపర్డెంట్ ను ఆదేశించారు.పేషంట్ బిడ్డతో డిశ్చార్జ్ అయినప్పుడు వారి వీడియోలు సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసి పేషెంట్ మాటలను ప్రజలకు తెలిసే విధంగా పబ్లిసిటీ ఇవ్వాల్సిందిగా మంత్రిగారు పేర్కొన్నారు. నార్మల్ డెలివరీలకు ప్రోత్సహించాలని అందుకు యోగా మాస్టర్ను ద్వారా నర్మర్ డెలివరీ అయ్యేందుకు ఉపయోగపడే యోగాసనాలను చేయించేలా చూడాలన్నారు.లివర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు మాట్లాడుతూ సి కె ఎం ఆసుపత్రికి ఐదు బెడ్స్ ను డొనేట్ చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం లక్ష రూపాయల వ్యయంతో ఐదు బెడ్లను అందిస్తానని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.ఆసుపత్రి అభివృద్ధికి కావలసిన సౌకర్యాలు అవసరాలను పిపిటి ద్వారా మంత్రికి ప్రజెంటేషన్ ఇస్తూ వివరించడం జరిగింది.వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఆసుపత్రుల అభివృద్ధికి అడ్మినిస్ట్రేషన్ కమిటీని ఏర్పాటు చేసి హాస్పిటల్లో ప్రక్షాళన చేయడం జరిగిందని ఈ ప్రక్షాళనలో భాగంగా ప్రస్తుతం ఆసుపత్రిలో మెరుగైన వైద్యంతో పాటు వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ



సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు: ఆసుపత్రి విస్తరణ: ప్రస్తుతం ఉన్న 75 పడకల సామర్థ్యాన్ని 100 పడకలకు పెంచుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపించేందుకు నిర్ణయం తీసుకున్నారు. వైద్య సేవలు: మూడో దశ విస్తరణలో భాగంగా కార్నియా, గ్లాకోమా, రెటినా మరియు స్క్వింట్ విభాగాల యూనిట్లను 4 నుండి 6కు పెంచుటకు నిర్ణయం తీసుకున్నారు. ఆధునిక పరికరాలు: ఆరోగ్యశ్రీ రివాల్వింగ్ ఫండ్ ద్వారా రూ. 1.73 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసేందుకు కమిటి ద్వారా ఆమోదం తెలుపనైనది. సిబ్బంది పెంపు: భద్రత, పారిశుధ్యం మరియు పేషెంట్ కేర్ సిబ్బందిని 32 నుండి 62 మందికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఖాళీగా ఉన్న టెక్నికల్, నాన్–టెక్నికల్ పోస్టులను ఏజెన్సీ ద్వారా కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఆదాయ వనరులు: ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులను పెంపొందించేందుకు, ఆసుపత్రి ప్రాంగణంలో వాణిజ్య దుకాణాలను నిర్మించి అద్దెకు ఇవ్వాలనే ప్రతిపాదనపై చర్చించారు.ఈ కార్యక్రమంలో టీజీఎంఎస్ఐడీసీ (టీజీఎం ఎస్ ఐ డీసీ ) ఈఈ కె.ఎస్.కే. ప్రసాద్ పాల్గొని, ఆసుపత్రి మరమ్మతులు మరియు సివిల్ పనుల అంచనా వ్యయాన్ని సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ విస్తరణ పనులు పూర్తయితే వరంగల్ ప్రాంత ప్రజలకు కంటి చికిత్సలో మరింత నాణ్యమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి.ఈ కార్యక్రమానికి అడ్మిన్ కమిటి మెంబెర్స్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైబి గణేష్, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డిబిసిడిఓ పుష్పలత, డి ఎస్ డి ఓ భాగ్యలక్ష్మి, ఇరిగేషన్ ఈ సునీత, ఎంజీఎం సూపర్డెంట్. హరిచంద్ర రెడ్డి, డాక్టర్ జి ఆర్ భరత్ కుమార్, డాక్టర్ కేబి చంద్ర భాను, డాక్టర్ వి శ్రీకుమార్, డాక్టర్ విజయ్ శ్రీ, డాక్టర్ వంశీ ప్రియ, డాక్టర్ చరణ్, డాక్టర్ శరత్, డాక్టర్ సంధ్యారాణి మరియు కమిటి సభ్యులు పాల్గొన్నారు.





THARANGALU DAILY NEWS
గురువారం , 21 మే , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ఆత్మకూర్‌లో లేఅవుట్ ల్యాండ్ పూలింగ్ పనుల పరిశీలన

- అభివృద్ధి--ఆదాయ వృద్ధికి ల్యాండ్ పూలింగ్ దోహదం
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి





**హనుమకొండ ప్రతినిధి,20 మే, తరంగాలు** : జిల్లాలోని ఆత్మకూర్ మండల కేంద్రంలో కుడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లేఅవుట్ ల్యాండ్ పూలింగ్ ను బుధవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న ల్యాండ్ పూలింగ్, లేఅవుట్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి, పనులను మరింత సమర్థవంతంగా చేపట్టాలని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా లేఅవుట్, రహదారులు, ప్లాటింగ్ పనులు ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని అన్నారు.ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా ప్రజలు తమ భూములను అభివృద్ధి కోసం అందించడం వల్ల వారి భూముల విలువ పెరగడంతో పాటు ఆదాయం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అలాగే అభివృద్ధి చెందిన లేఅవుట్ ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, పట్టణాభివృద్ధిలో భాగంగా ప్రణాళికాబద్ధమైన లేఅవుట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో ఆధునిక లేఅవుట్‌లను అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుడా పిఓ అజిత్ రెడ్డి, స్థానిక సర్పంచ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతం కావాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి, మే 20,తరంగాలు :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటి వరకు గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వాటి పురోగతి, బిల్లుల చెల్లింపు, గ్రౌండింగ్ కాని ఇండ్ల గురించిన వివరాలను గృహ నిర్మాణం శాఖ పీడీ సిద్దార్థ నాయక్, అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జిల్లా లక్ష్యం మూడు వేల నలభై ఐదు కాగా ఇప్పటి వరకు జిల్లాలో రెండు వేల తొంభై పూర్తయ్యాయని పేర్కొన్నారు. జూన్ రెండు నాటికి తొమ్మిది వందల యాభై ఐదు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంపై గృహ నిర్మాణ, ఎంపీడీవోలు దృష్టి పెట్టాలన్నారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డిఈ రవీందర్, ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

# చారిత్రక ప్రదేశాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి,మే 20, తరంగాలు** :చారిత్రక ప్రదేశాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు . 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల మూడవ రోజు హెరిటేజ్ వాక్ కార్యక్రమాలు బుధవారం వరంగల్ ఫోర్ట్ లో ఉత్సాహంగా జరిగాయి.ఈ సందర్భంగా వరంగల్ కోటలోని స్వయంభూ శివాలయం నుండి నిర్వహించిన హెరిటేజ్ వాక్ ఫోర్ట్ వరంగల్లోని స్వయంభు కాంప్లెక్స్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యా రాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, యూత్ అండ్ స్పోర్ట్స్ మరియు ఇంచార్జ్ టూరిజం అధికారి అనిల్ కిలా వరంగల్ తాసిల్దార్ ఇక్బాల్ మరియు జిల్లా అధికారులు జిల్లా అధికారులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వారసత్వ కట్టడాల పరిరక్షణ, చారిత్రక ప్రాధాన్యతపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ హెరిటేజ్ వాక్ నిర్వహించారు.యువత చరిత్ర, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.వరంగల్ కోర్టులో గైడ్ హమ్జాద్ కాకతీయ ప్రాశస్త్యాన్ని అన్ని కళ్లకు కట్టినట్టు వివరించినందుకు వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు.



# నరేగా పనులు,చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలి





- పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్
- రోజుకు 20 లక్షల మంది కార్మికులతో పనుల నిర్వహణ
- ప్రతి గ్రామంలో కనీసం 20 పనులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలి
- మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వచ్చే 40 రోజుల్లో వినియోగించాలి
- లైవ్ అథెంటికేషన్ సర్వేతో కొత్త అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరుకు అవకాశం
- ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలి
- నరేగా పనులు, చేయూత పింఛన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన స్పెషల్ సీఎస్

**వరంగల్ ప్రతినిధి,మే 20,తరంగాలు** :

నరేగా పనులు, చేయూత పెన్షన్ సర్వేను అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం, హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సెర్ఫ్ సీఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

హాజరయ్యారు.ఈ నేపథ్యంలో పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. నరేగా కింద వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతం చేయాలని, ప్రణాళికలో ఉన్న అన్ని పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు.

నరేగా పథకం జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుందని తెలిపారు.ప్రస్తుతం రోజుకు 15 లక్షల మంది కార్మికులు నరేగా పనుల్లో పాల్గొంటుండగా, వెంటనే ఆ సంఖ్యను 20 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల కోసం ముందురోజే కార్మికుల సమీకరణ చేపట్టాలని, పనులు గ్రామ హాబిటేషన్ పరిధిలోనే ఉండేలా చూడాలని, ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభించి, ప్రధాన పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాబోయే 40 రోజుల పాటు ఎంపీడీవోలు పూర్తిగా నరేగా పనులపైనే దృష్టి సారించి పనులను వేగవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అసైన్డ్ భూముల్లో కూడా ఫామ్‌పాండ్‌ల నిర్మాణ పనులను చేపట్టి రైతులకు ఉపయోగకరంగా మలచాలని సూచించారు.ప్రతి రోజు ఉదయం వేళల్లో జిల్లా కలెక్టర్లు స్వయంగా ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ముఖ్యమంత్రి సుమారు 8 వేల వీవో భవనాలకు శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో రాబోయే 40 రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భవన పనులను బుక్ చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, మహిళా సంఘాల భవనాలు వంటి నిర్మాణాలను నరేగా కింద ప్రణాళిక చేయవచ్చని తెలిపారు. గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌ల శుభ్రత పనులను నిరంతరంగా చేపట్టి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ. 408.79 కోట్లకు పరిపాలనా అనుమతులు లభించగా, ఇప్పటివరకు రూ.65.20 కోట్ల మేర మాత్రమే క్లెయిమ్ చేయబడిందని, ఇంకా రూ.343.59 కోట్ల బ్యాలెన్స్ నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే 40 రోజుల్లో ఈ నిధులను ప్రాధాన్యతగా బుక్ చేసి పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి జిల్లాకు సగటున రూ.30 కోట్లకు పైగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిగా వినియోగించాలన్నారు.

గత ఏడాది నీటి సంరక్షణ పనుల్లో పలువురు కలెక్టర్లు కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ ఏడాది మరింత ఎక్కువ పనులు జరుగుతున్నప్పటికీ పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయకపోవడంతో రాష్ట్రం ప్రస్తుతం 10వ స్థానంలో ఉందన్నారు. మనం చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్ పనుల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు.పనితీరు తక్కువగా ఉన్న మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని, నరేగా పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 20 పనులను గుర్తించాలని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ వెంటనే కొత్త జాబ్ కార్డులు జారీ చేయాలని తెలిపారు.రాష్ట్రంలో మొత్తం 41 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, అందులో పోస్టల్ శాఖ ద్వారా 21 లక్షల మందికి నగదు రూపంలో పెన్షన్ పంపిణీ జరుగుతోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మరో 20 లక్షల మంది లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్ జమ అవుతోందన్నారు.ఫేస్ రికగ్నిషన్ విధానం అమలుతో మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన లబ్ధిదారుల కారణంగా ఇప్పటికే సుమారు 20 వేల పెన్షన్లు తగ్గినట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులందరికీ లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో నిర్వహించిన పైలట్ సర్వేలో సుమారు 9 శాతం మంది లబ్ధిదారులు మరణించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. లైవ్ అథెంటికేషన్ సర్వే పూర్తయ్యే సమయానికి కనీసం 5 శాతం మరణించిన లబ్ధిదారుల కేసులు గుర్తించినా మరో లక్ష మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

నగదు రూపంలో పెన్షన్ పంపిణీని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. పెద్దపల్లి, జగిత్యాల, కొత్తగూడెం, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో ఇంకా సుమారు 2 వేల పోస్టల్ పంపిణీలు మాత్రమే ఉన్నాయని, వాటిని కూడా బ్యాంకింగ్ విధానానికి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

దివ్యాంగుల సదరం కేంద్రాల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించాలని, తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా సదరం కేంద్రాలు ఏర్పాటు చేసి దివ్యాంగుల అంచనా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో సదరం కేంద్రాల్లో అవసరమైన సౌండ్ ప్రూఫ్ పరికరాలు, ఇతర ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 80 నుంచి 100 శాతం తీవ్ర దివ్యాంగత కలిగిన సుమారు 23 వేల మంది ఉన్నారని, కొత్త పింఛన్ల మంజూరులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఎన్‌పీఏలను సున్నాకి తీసుకురావడంలో జిల్లాలు ముందుండాలి

నిర్మల్ జిల్లాలో ఎన్‌పీఏలను పూర్తిగా సున్నాకి తగ్గించడం అభినందనీయమని పేర్కొన్నారు. జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు కూడా త్వరలోనే ఎన్‌పీఏలను జీరో స్థాయికి తీసుకురానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యంగా స్త్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

స్త్రీనిధి రుణాల చెల్లింపులు, ఎన్‌పీఏల నియంత్రణపై ప్రతి నెల జిల్లా కలెక్టర్లు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలుకు సంబంధించి కొత్త జీవో విడుదలైందని, ఈ పథకం అమలు బాధ్యత గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం అమలుకు ఎంపీడీవోలే అధికారులని పేర్కొన్నారు. కుటుంబ పోషకుడిని కోల్పోయిన పేద కుటుంబాలకు ఈ పథకం కింద రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. ఇతర బీమా పథకాల ప్రయోజనం లేని ప్రతి అర్హ కుటుంబానికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో రివ్యూ చేస్తూ....ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి పని కల్పించాలని.. ఎంపీడీఓ లకు లక్ష్యాలను నిర్దేశించారు. గ్రామీణ అభివృద్ధి ధ్యేయంగా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి జిల్లా కి మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్, జెడ్పిసిఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, మునిసిపల్ కమిషనర్ లు ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, మే 20,తరంగాలు :** జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ల నిర్వహణ, నిబంధనల అమలు, ప్రజలకు మెరుగైన వైద్య సేవల అందింపుపై బుధవారం నిర్వహించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్య సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక వసతులు, వైద్య సిబ్బంది, పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.అలాగే రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావు, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

- ఆలయంలో ప్రత్యేక పూజలు





**వరంగల్ ప్రతినిధి , మే 20, తరంగాలు** :తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు.ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ ప్రధాన అర్చకులు శేషు ఆధ్వర్యంలో ఈవో, వేద పండితులు, అధికారులు, మరియు ప్రజాప్రతినిధులు పూర్ణకుంభంతో, మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు.స్వాగత మర్యాదల అనంతరం మంత్రి గర్భాలయంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె అమ్మవారిని వేడుకున్నారు.దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు మంత్రి కొండా సురేఖ కు వేదాశీర్వచనం అందజేశారు.ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను మంత్రికి బహూకరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

